
సాక్షి
పెద్దపల్లి
సోమవారం । 29 । ఏప్రిల్ । 2024



ఘనంగా పోచమ్మ బోనాలు

సుల్తానాబాద్: పూసాలలో ఆదివారం పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.



ప్రయాణికులకు ఆహ్లాదం

ఎలిగేడు: నర్సాపూర్ – కాట్నపల్లి మధ్య రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పచ్చని చెట్లు ప్రయాణికులకు ఆహ్లాదం పంచుతున్నాయి.

గరిష్టం/కనిష్టం
42.5/28.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఎండల తీవ్రత పెరుగుతుంది. వడగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మల్లన్న సన్నిధిలో భక్తుల సందడి



పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో తరలివచ్చిన భక్తులు.. తొలుత కోనేటిలో స్నానాలు ఆచరించారు. ఆ తర్వాత మల్లికార్జునస్వామి, శ్రీసీతారామచంద్రస్వామి, ఖండేలరాయుడిని దర్శించుకున్నారు. స్వామివారి పేరిట ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించారు. బోనాలు తయారు చేసి నైవేద్యం సమర్పించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రంలో అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల కోసం ఆదివారం చేపట్టిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 1,263 మంది విద్యార్థులకు 1,140 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 123మంది విద్యార్థులు గైర్హాజయ్యారు. పరీక్షల నిర్వహణ తీరును అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ పర్యవేక్షించారు. అడిషనల్ కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నృసింహుని సన్నిధిలో పూజలు



పూజలు చేస్తున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మారం(పెద్దపల్లి): ఖిలావనపర్తి గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామిని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో లక్ష్మణ్ కుమార్ విజయం సాధించాలని ముడుపు కట్టిన కాంగ్రెస్ కార్యకర్త ఆకాంక్ష మేరకు లక్ష్మణ్ కుమార్ శ్రీలక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. ముడుపు చెల్లించారు. అనంతరం స్వామివారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆలయ కమిటీ, అర్చకులతో చర్చించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహులు, నాయకులు లావుడ్య రూప్లానాయక్, చింతల ప్రదీప్‌రెడ్డి, కోమటిరెడ్డి దేవేందర్‌రెడ్డి, సంతోష్, మోటపలుకుల అశోక్, సోగాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి '



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చందర్

పాలకుర్తి(రామగుండం): అసెంబ్లీ ఎన్నికల్లో కల్లబొల్లి మాటలతో రైతులను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ కోరారు. గుడిపల్లి, జయ్యారం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆదివారం సందర్శించారు. రైతులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా.. ఇప్పటికి రైతుబంధు, రైతు రుణమాఫీ అమలు చేయలేదని విమర్శించారు. కనీసం వడ్లకు ప్రకటించిన రూ.500 బోనస్ ఇవ్వడం లేదని చందర్ విమర్శించారు. పెద్దపల్లి ఎంపీ నియోజకవర్గంలో ఆగర్భ శ్రీమంతుడికి, భూగర్భ గనికార్మికుడికి మధ్య పోటీ జరుగుతోందన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపిస్తే ప్రజలకు ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే వివేక్ కుటుంబానికి లాభమని, ఈవిషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ఈకార్యక్రమంలో పాలకుర్తి వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, బీఆర్ఎస్ నాయకులు చింతకింది సత్యనారాయణ, కొప్పు రాజేశం, అల్లం రాజయ్య, మదన్‌మోహన్‌రావు, కాసర్ల ఆశాలు, మల్లేశ్, ఐలేశ్, రాజేందర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు విస్తృతం

- సరిహద్దుల్లో 8 చెక్‌పోస్టుల ఏర్పాటు
- సీసీ కెమెరాలతో నిరంతర నిఘా
- అడుగడుగునా సోదాలు
- రూ.50వేలు దాటితే ఆధారాలు చూపాల్సిందే
- జిల్లాలో పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024



పాలకుర్తి మండలం వేంనూర్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు విస్తృతం చేశారు. అక్రమ నగదు రవాణా, విలువైన వస్తుసామగ్రి, అసాంఘిక శక్తుల కట్టడికి జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోంది. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తోంది. ప్రధానంగా ఎన్నికల్లో నగదు ప్రవాహాన్ని నియంత్రించడం లక్ష్యంగా నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది.

సామాన్యులకు ఇబ్బందులు..

- పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తమ అవసరాల కోసం రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్తున్న సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు తనిఖీలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
- గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే తరహా ఇబ్బందులెదురైన నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లాల్సి వస్తే అందుకు తగిన ఆధారాలు చూపాలని విస్తృతంగా ప్రచారం చేసింది.
- అయినా.. జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీల్లో నగదు పట్టుబడుతూనే ఉంది.
- పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత చేపట్టిన వాహనాల తనిఖీల్లో ఇప్పటివరకు రూ.1,06,62,092 నగదు స్వాధీనం చేసుకున్న అధికారులు.. ఆధారాలు చూపిన రూ.92,46,402 నగదు విడుదల చేశారు.

జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు..

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీపడుతున్న వివిధ పార్టీలకు చెందిన, స్వతంత్ర అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం, విలువైన వస్తుసామగ్రి తరలించే అవకాశం ఉందనే సమాచారంతో అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. వీటిని అడ్డుకునేందుకు పెద్దపల్లి జిల్లా సరిహద్దుల్లో 8 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రతీవాహనం తనిఖీ చేస్తున్నారు. అనుమానిత వస్తుసామగ్రి, అక్రమ నగదు స్వాధీనం చేసుకుంటున్నారు.

సీసీ కెమెరాలతో నిఘా..

- జిల్లాలోని అన్ని చెక్‌పోస్టుల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.
- వాటిలో రికార్డయ్యే సీసీ ఫుటేజీలను వెనువెంటనే జిల్లా మానిటరింగ్ అధికారులు తమ మొబైల్ ఫోన్లు, మానిటరింగ్ కేంద్రంలో పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు.

పెద్దపల్లి నియోజకవర్గంలో..

మండలం	ప్రాంతం
ఓదెల	గుంపుల
సుల్తానాబాద్	దుబ్బపల్లి

రామగుండం నియోజకవర్గంలో..

గోదావరి వంతెన
వేంనూరు
ఎల్లంపల్లి

మంథని నియోజకవర్గంలో ..

ఎగ్లాస్‌పూర్
మేడిపల్లి
కాళేశ్వరం

సీజ్ చేసిన నగదు వివరాలు

నియోజకవర్గం	సీజ్ (రూ.లక్షల్లో)	విడుదల (రూ.లక్షల్లో)
పెద్దపల్లి	10,05,500	10,05,500
రామగుండం	9,85,850	
మంథని	6,81,830	3,08,990
ధర్మపురి	25,66,710	25,09,710
చెన్నూరు	05,49,200	05,49,200
బెల్లంపల్లి	37,45,272	37,45,272
మంచిర్యాల	11,27,730	11,27,730

ఆధారాలు చూపకుంటే జప్తు..

ఆధారాలు లేకుండా తమవెంట రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్తే సంబంధిత అధికారులు ఆ నగదును స్వాధీనం చేసుకుంటున్నారు. ఆ సమయంలో జరిగే ప్రతీ అంశాన్ని వీడియోలో చిత్రీకరిస్తున్నారు. జప్తు చేసిన నగదును తిరిగి ఎలా పొందాలో వారికి అవగాహన కల్పిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న నగదు వివరాలతో కూడిన రశీదును సంబంధిత వ్యక్తులకు అందిస్తున్నారు.

ఇప్పటివరకు రూ.19.78లక్షల జప్తు

పార్లమెంట్ పరిధిలోని చెక్‌పోస్టులు, ఇతరత్రా చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.19,78,130 నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందులో పూర్తిఆధారాలను చూపిన వారికి రూ.7,45,500 విడుదల చేసినట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి. మిగతా రూ.12,32,630 నగదు సీజ్ చేసి ఉంచామని అధికారులు వివరించారు.

రూ.1.06కోట్ల జప్తు

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో చేపట్టిన వాహన తనిఖీల్లో ఇప్పటివరకు రూ.1,06,62,092 నగదు జప్తు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పెద్దపల్లి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. అందులో ఆధారాలు చూపిన రూ.92,46,402 నగదు విడుదల చేసినట్లు వివరించారు. సరైన ఆధారాలు సమర్పించని రూ.14,15,690 సీజ్ చేసి ఉంచామని ఆయన పేర్కొన్నారు. సీ – విజిల్ యాప్ ద్వారా 17 ఫిర్యాదులు, టోల్‌ఫ్రీ నంబరు 1950 ద్వారా 86 ఫిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు.

నిబంధనలు పాటించాలి

ఎన్నికల సంఘం నిబంధనలు అందరూ పాటించాల్సిందే. ఉల్లంఘించే వారిని గుర్తించేందుకు ఫ్లయింగ్‌స్క్వాడ్, స్టాటిక్ సర్వే లెన్స్, వీడియో సర్వే లెన్స్, అకౌంటింగ్ టీం, వ్యయ పరిశీలకులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తిస్తే టోల్‌ఫ్రీ నంబరు 1950, సీ – విజిల్ యాప్ ద్వారా మాకు సమాచారం అందించాలి. నగదును వెంట తీసుకెళ్లే వారు తప్పనిసరిగా తమ వద్ద తగిన ఆధారాలు ఉంచుకోవాలి.

– ముజమ్మిల్‌ఖాన్, కలెక్టర్, పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి

'గుర్తింపు' ఎప్పుడిస్తారు?

- ఎన్నికలు జరిగి నాలుగు నెలలు
- కార్మిక సంఘాలకు తప్పని ఎదురుచూపులు
- సింగరేణిలో నిలిచిన కీలక సమావేశాలు
- ఎన్నికల కోడ్ ఎత్తివేశాకే 'ధ్రువీకరణ' ఇచ్చే అవకాశం
- సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం నేతల్లో అనహనం



గోదావరిఖని: గతేడాది డిసెంబర్‌లో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఏఐటీయూసీ గుర్తింపు, ఐఎన్‌టీయూసీ ప్రాతినిధ్య సంఘంగా గెలుపొందాయి. అయితే, ఎన్నికలు ముగిసి నాలుగునెలలు గడిచినా యాజమాన్యం ధ్రువీకరణ పత్రాలను గెలిచిన సంఘాలకు అందజేయలేదు. దీంతో స్ట్రక్చరల్ సమావేశాలు లేకుండా పోయాయి. అలాగే సంస్థలో అనేక సమస్యలు పేరుకుపోతున్నాయి. కార్మికులు అనేక సమస్యల్లో చిక్కుకుని ఇబ్బందుల పాలవుతున్నారని కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్కంఠగా సాగిన పోలింగ్..

సింగరేణి బొగ్గు గనుల్లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు గతేడాది డిసెంబర్ 27న జరిగాయి. ఉత్కంఠభరితంగా జరిగిన ఈ ఎన్నికల్లో ఏఐటీయూసీ(సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్) గుర్తింపు యూనియన్‌గా, ఐఎన్‌టీయూసీ(సింగరేణి కాలరీస్ కోల్‌మైన్స్ లేబర్ యూనియన్) ప్రాతినిధ్య సంఘంగా గెలుపొందాయి. నాలుగు నెలలు పూర్తయినా గుర్తింపు, ప్రాతినిధ్య ధ్రువీకరణ పత్రాలను ఎన్నికలు నిర్వహించిన ఆర్‌ఎల్‌సీ కానీ, సింగరేణి యాజమాన్యం కానీ ఇప్పటికీ అందజేయలేదు. దీంతో అధికారికంగా జరిగే అనేక ఒప్పందాలు వాయిదా పడుతున్నాయి. సంస్థ వ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 40వేల మంది ఉద్యోగులకు సంబంధించిన అనేక అంశాలపై ఒప్పందాలు చేసుకోవాల్సి ఉంది. దీనిపై యాజమాన్యం పూర్తిస్థాయిలో స్పందించడం లేదని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఇవీ సమస్యలు..

- కార్పొరేట్ స్థాయి, ఏరియా స్థాయిలో నిర్వహించాల్సిన స్ట్రక్చరల్ సమావేశాలు నిలిచిపోయాయి.
- గుర్తింపు కార్మిక సంఘంతో కార్పొరేట్ స్థాయి, ఏరియా స్థాయి, ప్రాతినిధ్య సంఘంతో ఏరియాస్థాయి సమస్యలపై చర్చించి ఒప్పందాలు చేసుకోవాలి. కానీ, అవి నిలిచిపోయాయి.
- 35 నుంచి 40ఏళ్లకు డిపెండెంట్‌ల వయస్సు పెంపునకు ప్రభుత్వం అంగీకరించింది. కానీ సింగరేణిలో ఇంకా అది అమలు కావడం లేదు.
- విజిలెన్స్ విభాగంలో చాలాడిపెండెంట్ల ఉద్యోగాలు పేరుకుపోయాయి. చిన్నచిన్న కారణాలతో కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలో పేరుకుపోయిన ఉద్యోగాలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.
- ఏటా ఉద్యోగులకు ఇవ్వాల్సిన యాక్టింగ్ పదోన్నతులు నిలిచిపోయాయి.
- మైన్స్ కమిటీ సమావేశాలు కూడా ముందుకు సాగడం లేదు.

కోడ్‌పేరుతో జాప్యం తగదు



గతంలో ఎన్నికల కోడ్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు, ఉద్యోగాల ప్రక్రియ కొనసాగేది. ప్రస్తుతం అన్నీ నిలిపివేసి కార్మికులను యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రధానంగా రెగ్యులర్‌గా రావాల్సిన పదోన్నతులు నిలిపివేసింది. గుర్తింపు పత్రంకోసం యాజమాన్యం, ఆర్‌ఎల్‌సీ మధ్య కొద్దిరోజుల పాటు జాప్యం జరిగినప్పటికీ.. చివరకు సింగరేణి యాజమాన్యమే గుర్తింపు పత్రం ఇచ్చేందుకు అంగీకరించింది.

– వాసిరెడ్డి సీతారామయ్య, అధ్యక్షుడు, ఏఐటీయూసీ

కార్మికుల కోసమే శిక్షణ తరగతులు

- ఏఐటీయూసీ నేత రాజ్‌కుమార్



మాట్లాడుతున్న రాజ్ కుమార్

గోదావరిఖని: కార్మిక చట్టాలు, సంక్షేమం, సింగరేణి సంస్థ మనుగడ కోసం శిక్షణ తరగతులు దోహదపడతాయని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరివి రాజ్‌కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ అన్నారు. స్థానిక ఇల్లెందు క్లబ్‌లో ఆదివారం జరిగగిన ఆర్జీ–వన్ ఏరియా ముఖ్య కార్యకర్తల శిక్షణ తరగతులు, అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పాతతరం కార్మికులు ఉద్యోగ విరమణ చేస్తున్నారని, యువ కార్మికులు ఉద్యోగాల్లో చేరుతున్నారని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, కార్యదర్శి సింగు నర్సింహారావు, రిటైర్డ్ డీజీఎం ఎండీ శ్యాంసుందర్ రెడ్డి, డాక్టర్ సుమన్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యాస శ్రీనివాస్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించగా, నాయకులు సాబీర్‌పాషా, మడ్డి ఎల్లాగౌడ్, ఆరెల్లి పోశం, రంగు శ్రీనివాస్, మాదన మహేశ్, సంకె అశోక్, బోగ సతీశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఐదుతరాల అనుబంధం



సుల్తానాబాద్‌కు చెందిన అల్లంకి బుచ్చమ్మ వంశంలోని ఐదుతరాలు ఆదివారం ఒకేవేదికపై కలుసుకున్నాయి. వ్యాపారీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ ఆమె కుటుంబసభ్యులు.. తమ సాధకబాధకాలు తెలుసుకునేందుకు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఐదు తరాల్లోని సుమారు 350 మందికిపైగా కుటుంబసభ్యులు హాజరయ్యారు.

– సుల్తానాబాద్(పెద్దపల్లి)

బీఆర్ఎస్, బీజేపీ ఒకతాను ముక్కలే..

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్(పెద్దపల్లి): కల్లిబొల్లి హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేయడంలో బీజేపీ, బీఆర్ఎస్ ఒకతాను ముక్కలేనని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా స్థానిక శాస్త్రీనగర్‌లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలకు చేసింది శూన్యమన్నారు. కోటి ఉద్యోగాల హామీ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ఆగస్టు 15వ తేదీ వరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ సీఎం రేవంత్‌రెడ్డి చేసి తీరుతారని అన్నారు. ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాయకులు ప్రకాశ్‌రావు, దామోదర్‌రావు, గాజుల రాజమల్లు, రాజయ్య, రఫిక్, రాజు, సాయిరి మహేందర్, సాయిరి పద్మ, అంతటి అన్నయ్యగౌడ్, అబ్బయ్యగౌడ్, తిరుపతి, రాజలింగం, కోట శ్రీనివాస్, ప్రభాకర్, పన్నాల రాములు, గోపాల్‌రాజు పాల్గొన్నారు. కాగా, కందునూరిపల్లి, చిన్నకల్వల, నారాయణరావుపల్లి, గొల్లపల్లి గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు ఏరుకొండ రమేశ్‌గౌడ్, పన్నాల తిరుపతి, రిటైర్డ్ సీఐ నారాయణ, చిన్నబొంకూర్ గ్రామానికి చెందిన ఆర్ ఎంపీ చారితోపాటు బీఆర్ఎస్ వార్డు సభ్యులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

సరదా సరదాగా..



ఆటల పోటీల్లో మహిళలు

పాలకుర్తి(రామగుండం): ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనికి చెందిన శ్రీసీతారామ సేవా సమితి సభ్యులు పాలకుర్తి మండలం బుగ్గ శ్రీరామేశ్వరాలయం సందర్శకు వచ్చారు. ఆదివారం కావడంతో ఆటవిడుపు కోసం వచ్చిన మహిళలు.. పచ్చనిచెట్లు ఆహ్లాదం ఆస్వాదించారు. పక్షుల కిలకిల రావాలతో పులకించిపోయారు. సరదా కోసం పాటలు పాడుకున్నారు. ఆటలు ఆడారు. ప్రతిభ చూపిన వారికి జ్ఞాపికలు అందించి ఉత్సాహ పరిచారు. అనంతరం అందరూ కలిసి సహ పంక్తి భోజనాలు చేశారు.

నిండుకున్న రక్తం నిల్వలు

- బ్లడ్‌బ్యాంక్‌ల్లో రక్తం కొరత
- జిల్లాలో రక్తదాన శిబిరాలు కరువు
- ఎండలకు భయపడి ముందుకురాని దాతలు

జిల్లా సమాచారం

బ్లడ్‌బ్యాంకులు	యూనిట్ల సామర్థ్యం	ప్రస్తుత నిల్వలు
పెద్దపల్లి	400	19
గోదావరిఖని	400	65
మంథని	400	01



గోదావరిఖని జీజీహెచ్‌లోని బ్లడ్ సెంటర్

కోల్‌సిటీ(రామగుండం): జిల్లాలోని రక్తనిధి కేంద్రాలనే కాదు.. అత్యసర పరిస్థితుల్లోని పేషెంట్లను రక్తం నిల్వల కొరత వెంటాడుతోంది. గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)తోపాటు పెద్దపల్లి, మంథని ప్రభుత్వ ఆస్పత్రుల్లోని ప్రభుత్వ బ్లడ్ బ్యాంకుల్లో నిల్వలు నిండుకున్నాయి. ఆపదలో బ్లడ్‌బ్యాంకులకు వెళ్లేవారికి నిరాశే ఎదురవుతోంది. అవసరమైన బ్లడ్‌గ్రూప్ సకాలంలో దొరక్క, గాయాలపాలైన వారే కాదు.. పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణులు, తలసీమియా బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వేసవిలోనే సమస్య తీవ్రం..

- వేసవిలో స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి దాతలు ముందుకు రాకపోవడంతోనే నిల్వలు నిండుకుంటున్నాయని వైద్యులు చెబుతున్నారు.
- ప్రధానంగా కళాశాలల ఆధ్వర్యంలోనే ఎక్కువగా రక్తదాన శిబిరాలు జరుగుతుంటాయి.
- ఈ శిబిరాల్లో కాలేజీ స్టూడెంట్స్ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు వస్తున్నారు.
- దీంతో మిగతా రోజుల్లో రక్తం కొరత ఉండేది కాదు. కానీ ఏప్రిల్, మేలో వేసవి సెలవులు కావడంతోపాటు ఎండల తీవ్రత అధికంగా ఉంటోంది.
- దీంతో స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి యువత ముందుకు రావడం లేదని తెలుస్తోంది.
- వేసవిలో రక్తదానం చేస్తే నీరసించడం, ఎండలో తిరిగితే డీహైడ్రేషన్‌కు గురవుతామనే ఆందోళనలతో యువతతోపాటు విద్యార్థులు కూడా ముందుకు రావడం లేదని పలువురు వైద్యులు వివరిస్తున్నారు.

ఇబ్బందుల్లో పేషెంట్లు, బంధువులు..

సాధారణంగా పాజిటివ్ గ్రూపుల కొరత ఉండదు. కానీ ప్రస్తుతం నెగటివ్‌తోపాటు పాజిటివ్ బ్లడ్‌గ్రూపుల రక్తం కూడా అందుబాటులో ఉండటం లేదు. అరుదైన రక్తం యూనిట్లు దొరకడం ఇంకా కష్టంగా ఉంది. ఏ– నెగిటివ్, ఏబీ– నెగిటివ్ గ్రూపుల రక్తం అరుదుగా లభిస్తుంది. అత్యవసర సమయాల్లో స్టాక్ తప్పనిసరిగా ఉండాలి. ప్రస్తుతం బ్లడ్‌బ్యాంకుల్లో రక్తం నిల్వలు నిండుకోవడంతో పేషెంట్లు, వారి కుటుంబసభ్యులు ఇబ్బందులు పడుతున్నారు.

దాతలు స్పందిస్తేనే..

- రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయకపోవడంతో రక్తం సేకరణ పూర్తిగా తగ్గిపోయింది.
- దీంతో జిల్లావ్యాప్తంగా రక్తం నిల్వలు నిండుకుంటున్నాయి.
- ఉన్నతాధికారులు స్పందించి అవగాహన సదస్సులు, శిబిరాలు ఏర్పాటు చేసి రక్తదానం చేసేలా ప్రతీఒక్కరిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
- అలాగే ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తే తప్ప బ్లడ్ యూనిట్లు దొరకడం కష్టమే.
- యువకులు, స్వచ్ఛంద సంస్థలు, ఉన్నతాధికారులు స్పందించి రక్తం సేకరించడానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని బాధితులు కోరుతున్నారు.

అపోహలు వీడాలి



రక్తదానంపై అపోహలు వీడాలి. మనకు ఒకేఒక్క జీవితం ఉంది. రక్తదానం చేయడం ద్వారా ఈ జీవితాన్ని మరింత అర్థవంతం చేద్దాం. రక్తదానం నేరుగా మరొకరికి జీవితాన్ని ఇస్తుంది. ఒకవ్యక్తిని మాత్రమే కాకుండా, ఆ వ్యక్తి కుటుంబాన్ని కూడా కాపాడుతుంది. ఒకవ్యక్తి సంవత్సరానికి 3–4సార్లు రక్తదానం చేయవచ్చు. వేసవిలో రక్తదానం చేయడానికి చాలామంది ముందుకు రాకపోవడం బాధాకరం. రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని అవగాహన కల్పిస్తున్నాం. రక్తదానం చేసి ఆపదలో ఉన్నవాళ్లకు ప్రాణం పోయండి. కనీసం సంవత్సరానికి ఒక్కసారైనా రక్తదానం చేస్తామని ప్రతిజ్ఞ చేద్దాం.

– అముల్ కే బుట్టి, పాథాలజీ, అసిస్టెంట్ ప్రొఫెసర్, గోదావరిఖని

క్లుప్తంగా

అంజన్నకు భక్తుడి భూ విరాళం


కొండగట్టు ఆలయం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి భూమి విరాళంగా ఇచ్చేందుకు ఆదివారం ఓ భక్తుడు ముందుకు వచ్చాడు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన కప్పెర బాపురెడ్డి గ్రామంలోని తన 2.20 ఎకరాల భూమిని కొండగట్టు ఆలయానికి విరాళంగా ఇస్తానని, ఆలయ సూపరింటెండెంట్ సునీల్‌కు సంబంధిత పాస్‌బుక్, పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఈవో చంద్రశేఖర్‌తో మాట్లాడి త్వరలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

జగిత్యాల జిల్లాలో భానుడి ప్రతాపం

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకున్నాయి. వెల్గటూర్‌లో అత్యధికంగా 45.1 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకోగా, ఇబ్రహీంపట్నం గోదూర్‌లో 44.9, ధర్మపురి మండలం జైనాలో 44.5, బీర్‌పూర్ మండలం కొల్వాయి, జగిత్యాల రూరల్ మండలం పొలాసలో 43.9 డిగ్రీల సెల్సియస్ చొప్పున ఉష్ణోగ్రతలు నమోదైనాయి. కథలాపూర్‌లో 43.7, బుగ్గారం మండలం సిరికొండలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనాయి.

కరీంనగర్ డీఈవోకు షోకాజ్ నోటీస్

కరీంనగర్: ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తూ అక్రమ బదిలీకి పాల్పడిన కరీంనగర్ డీఈవో జనార్దన్‌రావుపై రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో వికాస్‌రాజ్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఈనెల 20న డీఈవో వ్యవహరించిన తీరుపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వివరాలు.. కరీంనగర్‌రూరల్ మండలం నగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.శ్రీనివాస్‌ను ఎస్సెస్సీ పరీక్షల్లో ఇన్విజిలేటర్‌గా విధులు నిర్వహించలేదనే కారణంతో మార్చి 19న పాఠశాల విధుల నుంచి డీఈవో సస్పెండ్ చేశారు. అనంతరం జరిగిన పరిణామాల్లో భాగంగా ఆ ఉద్యోగిని వీణవంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునర్నియామకం చేస్తూ ఈనెల 8న ఉత్తర్వులు జారీ చే శారు. రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమలు లో ఉండగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా పని చేస్తున్న ఒక ఉద్యోగి సస్పెన్షన్, పునర్నియామకం ఎలక్షన్ కమిషన్ మార్గ నిర్దేశాల కు విరుద్ధంగా జరిగిందని డీటీఎఫ్ ఆరోపిస్తూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎన్నికల సంఘం డీఈవోకు షోకాజ్ నో టీసు జారీ చేసింది. దీంతో ఇప్పటికే అనేక వివాదాల్లో చిక్కుకొని ఆరోపణలు ఎదుర్కొంటు న్న డీఈవో వ్యవహారంపై ఎన్నికల కమిషన్ ఎ లాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

నివేశ్‌కు కన్నీటి వీడ్కోలు

హుజూరాబాద్: అమెరికాలో గత ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇంజినీరింగ్ వి ద్యార్థి ముక్క నివేశ్ (20) అంత్యక్రియలు హుజూరాబాద్‌లో ఆదివారం జరిగాయి. ప్రమాదం జరిగిన వారం రోజులకు మృతదేహం ఇంటికి చేరడంతో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. నివేశ్ మృతదేహాన్ని చూసేందుకు ప్రజలు తరలివచ్చారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోశారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు నివేశ్ మృతదేహానికి నివాళి అర్పించారు.

సెలవులొచ్చాయ్ జాగ్రత్త

- 'నాలుగు రోజుల క్రితం కోరుట్ల పట్టణం వెంకటసాయి నగర్‌లో ఓ వృద్ధురాలి మెడ నుంచి మోటార్‌సైకిల్‌పై మాస్క్ ధరించి వచ్చిన యువకులు రెండు తులాల చైన్ లాక్కెళ్లారు'.
- 'గురువారం మెట్‌పల్లిలో మండలం వెల్లుల్ల గ్రామంలో దొంగలు ఓ ఇంటి తాళం పగులగొట్టి ఐదున్నర తులాల బంగారం, వెండి, రూ.42వేల నగదు దోచుకెళ్లారు'.
- 'శుక్రవారం రాత్రి కోరుట్ల మండలం అయిలాపూర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. తాళాలు పగులగొట్టి సుమారు తులంన్నర బంగారం ఎత్తుకెళ్లారు'.
- 'జగిత్యాల జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్‌లో శుక్రవారం రాత్రి తాళం వేసి ఉన్న రెండు ఇండ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. తాళాలు పగులకొట్టి సుమారు రూ.60వేలు ఎత్తుకెళ్లారు'.

- ఇళ్లకు తాళాలు వేసి టూర్లకు వెళ్తున్నారా..?
- ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..
- జిల్లాలో వేసవి చోరీల ముఠా సంచారం..?
- అప్రమత్తమైన పోలీసులు.. పెరిగిన నిఘా

కోరుట్ల: జగిత్యాల జిల్లాలో వారం వ్యవధిలో వరుస చోరీలు చోటుచేసుకున్నాయి. నాలుగు చోరీల ఘటనలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఒక్కసారిగా పెట్రోలింగ్ పెంచడంతో పాటు రోజూ పట్టణాలు, మండలాల సరిహద్దుల్లో నాకాబందీ నిర్వహించి అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని వివరాలు ఆరా తీస్తున్నారు.

తాళం వేసిన ఇళ్లపై కన్ను..

ఏటా వేసవిలో పిల్లలకు సెలవులు ఉండడంతో చాలా మంది వివాహాది శుభకార్యాలు, పుణ్యక్షేత్రాల సందర్శన, విహారయాత్రలకు వెళ్తుంటారు. ఈ క్రమంలో ఇండ్లకు తాళాలు వేసి రోజుల తరబడి టూర్లకు వెళ్లడంతో దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం చిక్కుతోంది. గత ఐదారేళ్లుగా వేసవిలో ఇండ్ల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న ఘటనలు పెరిగిపోతుండటంతో వేసవి రాగానే పోలీసు శాఖ అవసరమైన ముందు జాగ్రత్తలు చేపడుతున్నా అక్కడక్కడా చోరీలు జరుగుతున్నాయి. ఈ వేసవిలో పాఠశాలలకు సెలవులు ఇచ్చి వారం గడవక ముందే తాళాలు వేసి ఉన్న ఇండ్లలో చోరీలు మొదలయ్యాయి. జగిత్యాల జిల్లాలో తాళం వేసి ఉన్న ఇండ్లపై ఒకట్రెండు రోజులు నిఘా పెట్టి ఆ తర్వాత తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడే దొంగల ముఠా సంచరిస్తున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి వేళ పెట్రోలింగ్ పెంచడంతో పాటు ఇదివరకు తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడిన పాత నేరస్తుల వివరాలు సేకరించి వారు ఎక్కడెక్కడ ఉన్నారు, ఏం చేస్తున్నారన్న అంశంపై లోతుగా విచారణ సాగిస్తున్నట్లు సమాచారం.


ఇటీవల మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో ఓ ఇంట్లో వస్తువులను చిందరవందర పడేసిన దొంగలు

జాగ్రత్త పడితే మేలు..

- వేసవిలో ఇండ్లకు తాళాలు వేసి టూర్లకు, ఫంక్షన్లకు వెళ్లేవారికి పోలీసులు కొన్ని జాగ్రత్తలు సూచిస్తున్నారు.
- ఇంట్లో విలువైన వస్తువులు, నగదు ఉంచకపోవడం ఉత్తమం. బంధువులు లేదా తెలిసిన వారి వద్ద వాటిని ఉంచి వెళ్తే పెద్ద నష్టం ఉండదు. బ్యాంకు లాకర్లలో ఉంచితే మేలు.
- ఇండ్లు విడిచిన నాలుగైదు రోజుల పాటు దూరంగా ఉండే పరిస్థితి ఉంటే పోలీసులకు తమ చిరునామా వివరాలు ఇవ్వాలి. ఇంటికి ఎదురుగా ఉన్న తలుపులకు కాకుండా పక్కన ఉండే ద్వారాలకు తాళాలు వేయడం మంచిది. రోడ్డుపై సంచరించే వారికి ఎదురుగా తాళాలు వేసి కనిపిస్తే చోరీలకు ఆస్కారం ఉంటుంది. ఒకవేళ ఎదురుగా ఉన్న తలుపుకు తాళాలు వేయాల్సి వస్తే కర్టెన్ వేయాలి.
- ఇంట్లో సెక్యూరిటీ అలారం లేదా మోషన్ సెన్సార్ ఏర్పాటు చేసుకుంటే మంచిది. మోటార్‌సైకిళ్లను ఇంటి ఆవరణలో ఉంచి తాళాలు వేయాలి. ఇంట్లో సీసీ కెమెరాలను ఆన్‌లో ఉంచి వెళ్లాలి. తరచూ వాటిని సెల్‌ఫోన్‌లో గమనిస్తూ ఉండాలి. ఇంట్లో లేకున్నా కొన్ని గదుల లైట్లు వేసి ఉంచాలి.

అవసరమైన చర్యలు చేపట్టాం


వేసవిలో తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడే ముఠాలను పట్టుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం. ఇప్పటికే రాత్రి వేళ పెట్రోలింగ్ పెంచడంతో బ్లూకోల్ట్స్ పహారా పెంచినం. రోజూ నాకాబందీ చేపట్టి అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం. ఇళ్లకు తాళాలు వేసేవారు సమాచారం ఇచ్చి పోలీసులు సూచించిన మేరకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. అనుమానాస్పద వ్యక్తుల సంచరిస్తే 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలి.

– ఉమామహేశ్వర్‌రావు, డీఎస్పీ, మెట్‌పల్లి

అస్తమించిన కార్మిక నేస్తం

- అనారోగ్యంతో కన్నుమూసిన కార్మిక పక్షపాతి సామల మల్లేశం
- జీవితకాలం ప్రజా పోరాటాలకు అంకితమైన నేత
- నివాళి అర్పించిన కేటీఆర్, వినోద్‌కుమార్, కేకే మహేందర్‌రెడ్డి, కమ్యూనిస్టులు


సామల మల్లేశం(ఫైల్)

సిరిసిల్ల: జీవితకాలం ప్రజాపోరాటలకు అంకితమై, కార్మికవర్గ సమస్యల పరిష్కారానికి ఉద్యమించిన యోధుడు, కార్మిక పక్షపాతి, సీపీఐ నాయకుడు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల మల్లేశం (78) అస్తమించారు. సిరిసిల్ల పట్టణం బద్దం ఎల్లారెడ్డినగర్‌కు చెందిన మల్లేశం కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మరణించారు. ఐదు దశాబ్దాలుగా ఆయన బీడీ, పవర్ లూమ్ కార్మికుల సమస్యలపై పోరాటం సాగించారు. కార్మిక ఉద్యమాల్లో కీలక భూమిక పోషించిన మల్లేశం సిరిసిల్ల కార్మిక క్షేత్రంలో పేదలకు భూమి పట్టాలు ఇప్పించారు. సిరిసిల్ల మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వర్‌రావు సహచరుడిగా పని చేశారు. సుభాష్‌నగర్‌లో కార్మిక భవన్ నిర్మాణం, కమ్యూనిస్ట్ పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు. సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు డైరెక్టర్‌గా పని చేశారు. జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌లోని ఆయన ఇంట్లోనే తుది శ్వాసను విడిచారు. ఆయనకు భార్య శ్యామల, కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఆయన మృతదేహంపై ఎర్రజెండా కప్పి.. కామ్రేడ్ సామల మల్లేశం ఆశయాలు కొనసాగిస్తామంటూ.. కార్మికుల నినాదాల మధ్య .. కన్నీటి నివాళితో ఆయన అంత్యక్రియలు సిరిసిల్లలో నిర్వహించారు.

ప్రముఖుల నివాళి

సామల మల్లేశం అస్తమించారని తెలిసి సిరిసిల్ల ఎమ్మె ల్యే, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ నాయకులు తోట ఆగయ్య, గూడూరి ప్రవీణ్, జిందం చక్రపాణి ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. సిరిసిల్ల కాంగ్రెస్ నాయకులు కేకే మహేందర్‌రెడ్డి, వైద్యశివప్రసాద్, కాముని వనిత, తిరుపతిరెడ్డి, అడ్వకేట్ శాంతిప్రకాశ్‌శుక్లా, కమ్యూనిస్ట్ పార్టీ నాయకులు మర్రి వెంకటస్వామి, గుంటి వేణు, పంతం రవి, కడారి రాములు, అజ్జ వేణు, సోమ నాగరాజు, మణికంఠరెడ్డి, సుతారి రాములు, కోడం రమణ, ఎల్లారెడ్డి తదితరు నాయకులు నివాళి అర్పించారు.

కార్మిక లోకానికి తీరని లోటు

కరీంనగర్: సీనియర్ నాయకుడు, కార్మిక ఉద్యమ నేత సామల మల్లేశం అకాల మరణం సీపీఐకి, కార్మిక లోకానికి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలో నాడు పార్టీ నిర్మాణంలో చెన్నమనేని రాజేశ్వర్‌రావుతో కలిసి పనిచేశారని, ఆ ప్రాంతంలో అనేక కార్మిక సంఘాలను నెలకొల్పి కార్మికుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలో బద్దం ఎల్లారెడ్డి పేరున ఒక కాలనీ ఏర్పాటు చేసి అనేక మంది పేదలకు ఇండ్లు నిర్మించిన మహనీయుడని కొనియాడారు. ఆయన మృతి పట్ల సీపీఐ కరీంనగర్ జిల్లా సమితి పక్షాన సంతాపం ప్రకటించారు.

విధుల్లో చేరిన నెల రోజులకే..

- రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడి దుర్మరణం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): కొడుకు జీవితం బాగుండాలని తను అన్‌ఫిట్ అయి ఉద్యోగంలో చేర్పించిన నెల రోజులకే కుమారుడు మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ముగ్గురు ఆడపిల్లల తర్వాత పుట్టిన ఒక్కగానొక్క కొడుకు సింగరేణి ఉద్యోగం చేసి కుటుంబానికి అండగా ఉంటాడని భావించిన ఆ తండ్రి ఆశలు అడియాశలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. యైటింక్లయిన్‌కాలనీ టీ2–187 క్వార్టర్‌లో నివాసముంటున్న సింగరేణి రిటైర్డ్ కార్మికుడు పెర్క శంకర్‌కు ముగ్గురు కూతుర్లు, కుమారుడు పెర్క హేమంత్(22) సంతానం. హేమంత్ ట్రైనింగ్ పూర్తి చేసుకుని ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లి గనిలో బదిలీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం డ్యూటీ నుంచి వచ్చి ఇంట్లో ఉండగా, అతడి స్నేహితులు రావడంతో బయటకు వెళ్లాడు. అనంతరం అర్ధరాత్రి తన స్నేహితుడు రోహిత్ హైదరాబాద్ వెళ్తాననడంతో అతడిని షిర్కె బస్‌స్టాప్ వద్ద బస్సు ఎక్కించేందుకు.. మరో స్నేహితుడు మణికంఠతో కలిసి ద్విచక్రవాహనంపై అతడి వద్దకు బయలుదేరారు. సంతోష్‌నగర్ ఏరియాలోని సులభ్‌కాంప్లెక్స్ వద్దకు చేరుకోగానే బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన కరెంట్ స్తంభానికి ఢీకొనడంతో హేమంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. మణికంఠకు తీవ్రగాయాలు కాగా, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని 108లో గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు.


హేమంత్(ఫైల్)

శుభకార్యానికి వెళ్తూ అనంతలోకాలకు..

- డిచ్‌పల్లి వద్ద జరిగిన ప్రమాదంలో భార్య మృతి, భర్తకు గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదం ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో విషాదం నింపింది. శుభకార్యానికి వెళ్తున్న క్రమంలో భార్య మృతిచెందగా, భర్తకు తీవ్రగాయాలైనాయి. వివరాలు.. రాచర్లబొప్పాపూర్‌కు చెందిన మట్ట సురేశ్‌రెడ్డి, దీప్తి (45) దంపతులు కూతురు సమీక్షతో కలిసి బతుకుదెరువు రీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. నిర్మల్ జిల్లాలో బంధువుల ఇంట్లో ఆడెల్లి పోచమ్మ బోనాల పండుగ ఉండడంతో ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి కారులో భార్యాభర్తలు బయలుదేరారు. డిచ్‌పల్లి వద్ద కారు అదుపుతప్పి బోల్తాపడడంతో దీప్తి ఘటన స్థలంలోనే మృతిచెందింది. సురేశ్ రెడ్డి తీవ్ర గాయాలకు గురికాగా, ప్రాణప్రాయం లేదని వైద్యులు తెలిపారు. తల్లి మరణవార్త విన్న కూతురు సమీక్ష కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. రాచర్లబొప్పాపూర్‌లోని బంధువులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.


సురేశ్‌రెడ్డి-దీప్తి దంపతులు

శతాధిక వృద్ధురాలి కన్నుమూత


బుర్ర రాజమ్మ(ఫైల్)

ఎలిగేడు(పెద్దపల్లి): నర్సాపూర్ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు బుర్ర రాజమ్మ ఆదివారం ఉదయం కన్నుమూసింది. రాజమ్మ వయసు 100 ఏళ్ల వయసుపైబడి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఆమెకు కోడలు బుర్ర భాగ్యమ్మ, మనుమలు ఉన్నారు.

స్వగ్రామానికి మృతదేహం

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన మెహమ్మద్ నబి (55) గత నెలలో సౌదీలో ప్రమాదవశాత్తు మృతిచెందగా, అతడి మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. స్థానికుల వివరాలు.. మెహమ్మద్ నబి కొన్నేళ్లుగా బతుకుదెరువు కోసం సౌదీ వెళ్లి వస్తున్నాడు. గత నెలలో ఓ కంపెనీలో పని చేస్తుండగా పొక్లెయిన్ యాక్సిడెంట్ కావటంతో తీవ్రగాయాలైనాయి. తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మార్చి 30న మృతిచెందాడు. గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్ విమానాశ్రయం నుంచి ఉచిత అంబులెన్స్ ద్వారా ఎన్నారై డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ సహకారంతో మృతదేహాన్ని మాదాపూర్‌కు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

వాహన తనిఖీల్లో మద్యం పట్టివేత

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని లింగంపేట రోడ్డులో ఆదివారం ఉదయం పట్టణ ఎస్‌ఐ నరేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టగా అంతర్గాం గ్రామానికి చెందిన షేర్ కిషన్ వద్ద రూ.13,200 విలువైన 12.60 లీటర్ల మద్యం పట్టుకుని కేసు నమోదు చేశారు. జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా చెర్లపల్లె గ్రామానికి చెందిన బండారి రాజిరెడ్డి తన ద్విచక్ర వాహనంలో తీసుకెళ్తున్న రూ.3,800 విలువైన 3.5 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే కొత్తబస్టాండ్‌లో పట్టణ ఎస్‌ఐ మన్మథరావు వాహనాల తనిఖీ చేపట్టగా టీఆర్‌నగర్ గ్రామానికి చెందిన అనంతుల వెంకటి తన ద్విచక్ర వాహనంలో తీసుకెళ్తున్న రూ.6,376 విలువైన 10 లీటర్ల మద్యం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుండెపోటుతో బీజేపీ నాయకుడి మృతి


ఆది కేశవరావు(ఫైల్)

ఓడెల(పెద్దపల్లి): ఓదెల మండలం కనగర్తి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు ఆది కేశవరావు(51) శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. గోదావరిఖనిలో జరిగిన పార్టీ సమావేశానికి హాజరైన ఆయనకు అకస్మాత్తుగా ఛాతిలో నొప్పితో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే చికిత్స కోసం కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కేశవరావు విద్యార్థి దశనుంచి బీజేపీలో చేరి దాదాపు 30 ఏళ్లకు పైగా పనిచేశారు. ఆదివారం కనగర్తిలో జరిగిన అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, కాసిపేట లింగయ్య పాల్గొని పాడె మోశారు. చాలా ఏళ్లుగా కరీంనగర్‌లో నివాసముంటూ, అందరితో కలివిడిగా ఉండే కేశవరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. మండల, గ్రామ స్థాయి బీజేపీ నాయకులు అంత్యక్రియల్లో పాల్గొని కంటతడిపెట్టారు. కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య సుమలత, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

క్రేన్ బావిలో పడి మహిళ..


మల్లవ్వ మృతదేహం

వేములవాడరూరల్: పూడిక తీసేందుకు వినియోగించే క్రేన్ ప్రమాదవశాత్తు బావిలో పడిన ఘటనలో ఓ మహిళ మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో ఆదివారం ఫాజుల్‌నగర్‌కు చెందిన దండుగుల మల్లవ్వ (70), ఆమె కుమారుడు కొమురయ్య, కోడలు గంగమణి, మరో వ్యక్తి మేడుదుల దేవయ్యలో కలిసి పూడికతీత పని చేస్తుండగా ప్రమాదవశాత్తు క్రేన్ బావిలో పడింది. ఆ సమయంలో క్రేన్ నడుపుతున్న మల్లవ్వ కూడా బావిలో పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మారుతి తెలిపారు.

చెరువులో మునిగి యువకుడు..


అనిల్ (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): ధర్మారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బానోతు అనిల్ (26) ప్రమాదవశాత్తు చెరువు నీటిలో మునిగి మృతిచెందాడు. ఎస్సై సత్యనారాయణ వివరాల ప్రకారం.. మతి స్థిమితం సరిగా లేని అనిల్ శనివారం ఇంటి నుంచి బొమ్మారెడ్డిపల్లి వైపు వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం సాయంత్రం ధర్మారం శివారులోని ఊర చెరువులో అతడి మృతదేహం కనిపించింది. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువు నీటిలో పడి మరణించి ఉండవచ్చని అనిల్ తల్లి చిన్నమ్మ ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు


గాయపడిన మైనొద్దీన్



గాయపడిన మహిళ, ఆమె కుమారుడు

కమాన్‌పూర్(మంథని): మండలంలోని మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి నుంచి పోలీస్‌స్టేషన్ వెళ్లే దారిలో ఆదివారం రాత్రి జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. స్థానికుల వివరాలు.. కమాన్‌పూర్‌కు చెందిన మైనొద్దీన్ ద్విచక్రవాహనంపై వస్తుండగా అదుపుతప్పి పడిపోవడంతో గాయపడ్డాడు. అలాగే యైటింక్లయిన్ కాలనీకి చెందిన శ్రీనివాస్, అతడి భార్య, కుమారుడు స్కూటీపై వస్తుండగా అదుపుతప్పి పడిపోవడంతో ముగ్గురికి గాయాలైనాయి. రోడ్డు కుంగిపోయి, గుంతలు పడడంతో నిమిషాల వ్యవధిలో రెండు ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదానికి గురైనాయి. రోజూ వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని ఇటీవల పోలీస్, రెవెన్యూ ఉద్యోగులు సైతం ప్రమాదాలకు గురయ్యారని స్థానికులు తెలిపారు. కొద్దిరోజుల క్రితం రహదారి విస్తరణ చేపట్టగా, పనులు నాసిరకంగా చేయడంతో రోడ్డు కుంగి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాహనదారులు, పేర్కొంటున్నారు.

'బై బ్యాక్ పద్ధతి'లో సజ్జ సాగు

- క్వింటాల్‌కు రూ.7వేల చొప్పున విక్రయించేలా ఒప్పందం


మెట్‌పల్లి ప్రాంతంలో సాగవుతున్న సజ్జ పంట

జగిత్యాల అగ్రికల్చర్: వేసవి సీజన్‌లో జగిత్యాల జిల్లాలోని చాలా ప్రాంతాల్లో నువ్వులు, మొక్కజొన్న, పెసర, కంది పంటలకు ప్రత్యామ్నాయంగా సజ్జ సాగు చేస్తూ రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు. సజ్జ పంటను విక్రయించేందుకు నేరుగా ప్రైవేట్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. వేసవిలో జిల్లాలో అనువైన వాతావరణ పరిస్థితులు ఉండటంతో సజ్జను విత్తనోత్పత్తిగా పలు కార్పొరేట్ కంపెనీలు ఇక్కడి రైతుల చేత ఉత్పత్తి చేయిస్తున్నాయి.

ధర ఆశాజనకంగా ఉండటంతో..

విత్తనోత్పత్తి చేసిన రైతులకు ప్రైవేట్ కంపెనీలు క్వింటాల్‌కు రూ.7 వేల వరకు ఇస్తున్నాయి. కంపెనీలే విత్తనాలు ఇవ్వడం, పంట పండిన తర్వాత బై బ్యాక్ పద్ధతిలో ఆ పంటను కొనుగోలు చేయడం రైతులకు కలిసివస్తుంది. జిల్లాలో అనువైన వాతావరణం ఉండటంతో ప్రైవేట్ కంపెనీలు ఇప్పటి వరకు వరి, ఆవాల పంటలో విత్తనోత్పత్తి చేయించగా, తాజాగా సజ్జలో చేయిస్తున్నాయి. అలాగే రైతులు ఎక్కువగా సాగు చేసే వరి, మక్క, పత్తి, కంది, పెసర వంటి పంటలకే ప్రభుత్వ మద్దతు ధర ఉండగా, మిగతావాటికి లేదు. దీంతో రైతులు ఏదైనా కొత్త పంట సాగు చేస్తే, ఆయా పంట ఉత్పత్తులు మార్కెట్‌కు వచ్చే వరకు ఏ ధర ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో, పంటకు ముందే ఫలానా ధర చెల్లిస్తామని కంపెనీలు ముందుకు రావడంతో రైతులు సజ్జ వైపు మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు తక్కువ కాలంలో పెద్దగా ఖర్చు లేకుండా పంట చేతికి అందుతుండటంతో ఈ పంట వైపు దృష్టి పెడుతున్నారు.

పదివేల ఎకరాల్లో..

జిల్లాలోని మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కథలాపూర్ ప్రాంతాల్లో ఎక్కువగా, జగిత్యాల, మేడిపల్లి, రాయికల్ ప్రాంతాల్లో మోస్తరుగా జిల్లా మొత్తంగా దాదాపు 10 వేల ఎకరాల్లో రైతులు బై బ్యాక్ పద్ధతిన సజ్జను సాగు చేశారు. కాగా జిల్లాలో అటవీ ప్రాంతం ఎక్కువగా ఉండటంతో మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలు వేస్తే అడవి పందులు, కోతులు, రామచిలుకలు తీవ్ర నష్టం చేస్తున్నాయి. వీటికి ప్రత్యామ్నాయ పంటగా రైతులు సజ్జ సాగు చేస్తున్నారు. ఐదారు నీటి తడులు ఇస్తే సరిపోతుండటం, పెద్దగా ఎరువులు వేసే అవకాశం లేకపోవడంతో పాటు పంట 85–90 రోజుల్లోనే చేతికి వస్తుంది.

ఎకరాకు కిలో విత్తనం

ప్రైవేట్ కంపెనీలే విత్తనాలు కిలోకు రూ.800 చొప్పున సరఫరా చేస్తున్నాయి. ఎకరాకు కిలో విత్తనాలు అవసరమవుతాయి. ఆడ, మగ విత్తనాలు ఇస్తారు. విత్తనోత్పత్తి కింద సాగు చేసిన రకాల్లో ఎకరాకు 10–14 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మంచి దిగుబడి వస్తే ఎకరాకు రూ.80 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశముంది. ఇక్కడి పంటను సీడ్ కంపెనీలు పంజాబ్, హర్యానా, రాజస్తాన్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు సరఫరా చేస్తాయి. అక్కడ పాడి గేదెలకు ఆహారంగా, పశుగ్రాసంగా ఇక్కడి విత్తనాలు ఉపయోగిస్తారు. ఏదైనా గ్రామంలో 50 శాతం మంది రైతులకు 10 క్వింటాళ్ల కంటే తక్కువ దిగుబడి వస్తే పది క్వింటాళ్ల వరకు రేటు చెల్లిస్తారు. అంతకంటే ఎక్కువ దిగుబడి వస్తే ఆ మేరకు ధర చెల్లిస్తారు.

మంచి ఆదాయం


పసుపు, మొక్కజొన్న పంట పూర్తయిన తర్వాత నువ్వు పంటకు ప్రత్యామ్నాయంగా సజ్జ పంటను మా ఊర్లోనే 300 ఎకరాల్లో సాగు చేస్తున్నాం. కంపెనీలు చెప్పిన మాదిరిగా అన్ని రకాల యాజమాన్య పద్ధతులు పాటిస్తుండటంతో మంచి ఆదాయం వస్తుంది.

– మారు మురళీధర్‌రెడ్డి, వెల్లుల్ల, మెట్‌పల్లి

అనుకూల వాతావరణం


యాసంగిలో జగిత్యాల జిల్లాలో సజ్జ పంట విత్తనోత్పత్తికి అనుకూలమైన వాతావరణం ఉంటుంది. ఉష్ణోగ్రతలు అంతగానం తక్కువ, ఎక్కువ కాకుండా ఉంటాయి. దీంతో పంట దిగుబడులు బాగా వస్తున్నాయి. రైతులకు మంచి ఆదాయం వస్తుంది.

– మిట్టపెల్లి రాజేశ్‌రెడ్డి, జగ్గాసాగర్, మెట్‌పల్లి